# మృగతృష్ణ మీది వ్యామోహం

(క థా ని క)

ఆకాశం తమస్సంఛన్నమైంది. సన్నని తుంపర ప్రారంభమైంది. ఒక అరగంటకు వర్షము పెద్దదై, కుంభవృష్టిగా కురియసాగింది. బజారులన్నీ జలమయములైనాయి.

ఆపట్టణంలో ఒక డాబా ముందొక గుర్రపు బండీ ఆగింది. వర్షపు ధారలతో బండిలోనే ముద్దయిన ఒక దేవతా సదృశ కామిని బండి నుండి దిగి, త్వరిత గతిని డాబావసారోలోకి పోయి తలుపు తాళము తీసి స్విచ్ నొక్కి విద్యుద్దీపము వెలిగించింది. ఆమె వెంట నామె సోదరుడు, ఆమె దాసికూడ బండినుండి దిగి లోనికిపోయారు. వర్షంలో తడియుట కలవాటు పడిన బండివాడు కూడ డాబా వసారాలోకి పోయి "అమ్మగారూ! బాడుగ యిప్పించండి" అని అడిగాడు.

ఆ మాటలు విని బట్టలు మార్చుకుంటున్న చంద్రిక, "తమ్ముడూ! అతనికి ఇంకొక అర్థ రూపాయి ఎక్కువగా యిచ్చిపంపు. నా పర్సు టేబిల్ మీద ఉంది" అన్నది.

ఆమె సోదరుడు వసంత్ బండివాడికి అక్క ఆజ్ఞ ప్రకారం రూపాయిన్నర యిచ్చి పంపాడు.

"ఇంత వానలో ఇల్లుచేర్చాడు. బజారులో యెక్కడ మనుషులక్కడ నిలబడిపోయారు. ఇప్పుడు కైంకూడా యెక్కువకాలేదు. ఎనిమిదిన్నరయింది" అని అన్నది చంద్రిక చేతినున్న గడియారంవంక చూచి.

"త్వరగా భోజనాలుచేదాం. వెంకీ, త్వరగా అన్నం వడ్డించవే. నాలుగు మెతుకులు తింటే సరిపోతుంది. అసలీ పూట అన్నం సహించేటట్లు లేదు. ఆ టీ పార్టీలో పిండివంట లెంత బావున్నాయి! ఆ పిండివంటల మాధుర్యాన్ని మించి వుంది శర్మగారి ఉపన్యాసం! ఆయన ఉపన్యాసం కంటే వందరెట్లు అందంగా ఉన్నాడు. నాకు ముప్పయిరెండేళ్లు వచ్చాయి. అందమూ, విజ్ఞానమూ, వక్తృత్వమూ - అన్నీ సమ్మేళనం పొందిన మగవారిని నే నెప్పుడూ చూడలేదు. ఆయన నవ్వుతూంటే నిజంగా అపరమన్మథు డనిపించింది నాకు. ఆయన ఈ వూళ్ళోనే వుంటున్నాడుట కాదూ! నా యింటికి అటువంటి మహాపురుషు లెందుకు వస్తారు. ఒక వేశ్యనై జీవించే నాకటువంటి మహనీయులతో స్నేహం లభిస్తుందా నా ఈ పాడు జీవితంలో...?" అని ఒక దీర్ఘమగు నిట్టూర్పు విడిచి తమ్ముడితో భోజనశాలలోకి రంభవలె నడిచి వెళ్ళింది.

తనువమ్ముకొనే వేశ్యకు మనసుండదని లోకం భావిస్తుంది కాని, ఆమె తన హైన్య జీవితాన్ని మనసులో ఎంతగా ద్వేషిస్తుందో మానవులకు ముఖ్యంగా కామాంధులకు తెలియదు. చంద్రిక వేశ్యయేగాని సామాన్య వేశ్య కాదు. ఆమె సామాన్య వేశ్యా జీవితాన్ని జీవించడం లేదు. తనను కన్న తల్లి తన జీవనోపాధికి, తన సౌందర్యము, సంగీతము, కళాభిరుచి, ఒక డాబా మాత్ర మిచ్చిపోయింది. ఆమెకు సంగీతమువలన జీవనోపాధి జరిగెడి అవకాశం లభించలేదు. సభలలో పాటకచ్చేరీలు చేసేటంత విద్యలేదు. ఇక నాటకాలలో, సినిమాలలో నటించడానికి ఆమె ప్రయత్నించ లేదు. ఆమెకొరెంటిలో చాలామంది స్త్రీలు ధనార్జన చేస్తున్న విషయం తెలుసుగాని వారికా అవకాశము ఎట్లు లభించినో ఆమె విచారించలేదు. అదీగాక ఆమెకు పదిహేనో ఏటనే వృద్ధురాలగు తల్లి క్షుద్రమగు వేశ్యా జీవిత మలవాటు చేసింది. ఆమె తల్లికి ఉదాత్తాశయాలు లేవు. తనవలెనే తన ఏకైక కుమార్తె కూడా వేశ్యా జీవితంలో సంఘ సేవచేసి తరించాలని ఆ తల్లి కోరిక.

పెనుమర్తి కామేశ్వరరావు

చంద్రికను ఇరువదిఅయిదు సంవత్సరాలుగానే ప్రపంచ మర్మమైంది కాని తన జీవితం దురదృష్టంవల్ల తప్పు మార్గంలోబడటం ఆమె తెలిసికొని-తన జీవితాన్ని బాగుచేసుకోడానికి ఏ మార్గమూ కనిపించక, భవిష్యత్తు అంధకారంగా తోచి, తనకున్న జీవితంతోనే తృప్తిపడసాగింది.

కానీ, ఆనాడు ఆ గ్రామంలో సుప్రసిద్ధ తారామణి పార్వతికి జరిగిన సన్మానం, ఆ సన్మానంలో ఆమె శక్తి సామర్థ్యాలను ప్రశంసిస్తూ మాట్లాడిన శర్మ మొదలైన కళాకారులఉపన్యాసాలు చంద్రికలో నూతనాశలు తొలకరింప చేసినయి. పార్వతి అదృష్టం ఆమె కసూయ కలిగించింది. పార్వతిని చంద్రిక తన చిన్నతనంనుండీ ఎరుగును. తాను దుర్భరమగు వేశ్యా జీవితంలో వుండగా, పార్వతి గొప్ప సినిమా నటియై కీర్తి గడించి సన్మానింపబడింది. కళాకారు లెందరో ఆమెను ప్రశంసించారు. పార్వతికూడా తనవలెనే వేశ్యా వృత్తిలో దిగిన మనిషే. కాని ఆమె అదృష్ట రేఖలు ఆమెను తారాపథంలోకి తీసుకపోయాయి. తాను పదిహేనవ ఏట ఎటులున్నదో, ముప్పై రెండో ఏట కూడా బ్రతుకులో ఏమార్పూ లేక, పశుబలా హంకారులు, ధన మదాంధులు, అజ్ఞానులు, కూపస్థమండూకాలూనగు విటులకు తనువమ్ముకొనుచు, జీవిస్తున్నది. శిరీష కుసుమ పేశలమగు తన తనువు వికాసరహితమై నలిగి పోతున్నది. ఆమె మనసులో టీపార్టీ అనంతరం జరిగిన సభలో వుపన్యసించిన శర్మ సిల్కు లాల్చీ, అతని జులపాల క్రాపు, చక్కని కళ్లజోడు-అతని కంఠస్వరము, వీటన్నింటిని మించి అతని సుందరాకారము హత్తుకున్నవి.

చంద్రిక భోజనంచేసి తాంబూలం సేవించి సోఫాలో కూర్చొని తన జీవితాన్ని తలుచుకుని దిగాలుపడి కూచుంది. ఆమె తమ్ముడు వసంత్ గ్రామఫోను పెట్టె తెరచి సైగాల్ రికార్డు పెట్టాడు. "దుఃఖకే" అను ఆ పాట చంద్రిక మానసిక విషాదానికి నేపథ్య సంగీతం వలె వుంది. ఆమె పాటను విన లేకపోయింది.

"తమ్ముడూ, పొద్దుపోయింది. గ్రామఫోను ఆపేసి వెళ్ళి పడుకో. ఆయనవచ్చే వేళయింది" అన్నది చంద్రిక.

"రైలు బండి ఇవాళ లేటవుతుంది" అన్నాడు వసంత్.

"నీకెలా తెలుసు?" అన్నది చంద్రిక.

"ప్రతిబండీ లేటుగానే వస్తున్నది. దేశంలో ఎక్కడ జూచినా రైలుప్రమాదాలే. ఆసలాయన వచ్చే రైలు కూడా ఎక్కడో పడిపోయి వుంటుంది. నా ఉద్దేశ్యంలో ఆయనీరాత్రికి రాడు." అన్నాడు వసంత్.

"రైలుబండీ లేకపోతే ఆయన రెక్కలు కట్టుకునైనా ఇక్కడ వచ్చివాలుతాడు. నడిచైనా వస్తాడు. వాళ్లవూరు ఇక్కడికి పది మైళ్ళేట. ఏమైనా ఆయన ఉంపుడుకత్తెను నేను. ఆయన ప్రతిదినం వచ్చే టయిము కావస్తున్నది" అన్నది చంద్రిక.

వసంత్ అక్క అజ్ఞప్రకారం తన గదిలోకి వెళ్ళి పరున్నాడు. వంటయింట్లోంచి దాసీది వచ్చి పడకగదిలో పందిరిమంచంమీద చెదిరి వున్న పక్కను దులిపి దానిపై చంద్రిక నగిషీ అల్లికలుగల అందమైన తెల్లని దుప్పటి పరిచి, తలగడలు సరిగా అమరిచి, దోమతెర క్రిందకు దింపి చంద్రిక వద్దకు వచ్చింది.

"వెంకీ! తల నొప్పిగావున్నదే! పార్వతి నటించిన టాకీ వూళ్ళో ఆడుతున్నదట. నేనామె నటించిన టాకీ ఒకటి కూడా చూడ లేదు. రెండో ఆట సినిమాకు పోదామా?" అన్నది చంద్రిక.

"అయ్యగారు వచ్చేవేళయింది. ఆయనవచ్చే సరికి మీరింట్లో లేకపోతే ఆయనకు కోపం వస్తుందేమో?" అన్నది వెంకి.

"నాది అస్వతంత్ర జీవితం. నాకిష్టం లేక పోయినా నేనాయన ఇష్టప్రకారం నడుచుకోవాలి. ఏమైనాసరే నేనీరాత్రికి సినిమా చూడాలి. నిద్రపోయావా వసంత్?" తమ్ముడిని పిలిచింది.

వసంత్ తన గదిలో దీపం వెల్తురులో సినిమా పత్రిక చదువుతున్నాడు! అతడా పత్రికతో అక్కవద్దకు వచ్చి "ఇదుగో పార్వతీ ఫొటో. ఇది చూచి సంతోషపడు ఈరాత్రికి. ఇవాళ ఆయననడిగి మనం రేపు మొదటిఆటకు సినిమాకు పోదాం." అన్నాడు.

"అలా కాదు. నేనీరాత్రి ఆమె నటించిన టాకీ చూసితీరాలి. నేనూ వెంకీ వెళ్తాను. నువ్వింట్లో ఉండి ఆయన రాగానే తలుపు తీసి ఆయనకు మేము ఫలానా టాకీకి వెళ్ళామని చెప్పు చాలు. చూడాలంటే ఆయన కూడా వస్తాడు. ఆయన వెంట నీవు కూడా రా. తెలిసిందా? వెంకీ గుర్రపుబండీ పిల్చుకరా. వాన లేదుగా?" అన్నది చంద్రిక.

"తుంపర పడుతోంది. అసలీరాత్రి ఆయన రాకుండావుంటే బావుండును. ఆయన మా పెద్దకోప దారిమనిషి అమ్మగారూ!" అని వెంకి గుర్రపుబండీ పిల్చుకరావడానికి గొడుగు వేసుకొని బయలుదేరింది.

అనాటి తేసీటివింమకు చంద్రిక వెళ్ళకపోతే ఆమెకీ ఉత్సాహం కలిగేదికాదు. పడుపు వృత్తిలో తన జీవితం పాడయిపోయిందనీ, తానజరామరమగు కళాసేవ చేయలేకపోయాననీ, ఆమె మనసులో దిగులు పడడమేగాక- తనను పోషిస్తున్నవాని అనుమతి లేకుండా తానారాత్రి టాకీకి పోవడానికి లేని సాహసాన్ని తెచ్చుకున్నది. ఏమైనా సరే తాను గట్టిప్రయత్నంచేసి ఒక టాకీలో నటించి నటీమణి కావాలని వ్యర్థసంకల్పము కలిగింది. పార్వతికీ శర్మగారికీ సన్నిహిత స్నేహముండటంవల్లనే ఆయన ఒక సామాన్య వేశ్య గురించి అంతగా ప్రశంసిస్తూ మాట్లాడి వుంటాడని చంద్రిక ఉద్దేశ్యం. అది స్త్రీ సహజమైన ఆలోచన. సామాన్య ప్రజలంతా చంద్రికవలె శర్మగారి శీలాన్ని అనుమానిస్తారు. తాటిచెట్టుక్రింద పాలుత్రాగినా, కల్లుత్రాగాడంటారు ప్రజలు!

వెంకి బండి పిల్చుక వచ్చింది. చంద్రిక చక్కగా సింగారించుకొని బండియెక్కి సినిమా చూడడానికి వెళ్ళింది. వెంకి ఆమెకు కంటికి రెప్పవంటిది. వసంత్ లోపల తలుపులు గడియ వేసుకుని పడుకున్నాడు.

చంద్రిక-వెంకి రిజర్వుడు తరగతి టిక్కెట్లు తీసికొని హాలులోకి వెళ్ళి కూర్చున్నారు. ఆట ప్రారంభంకాలేదు. మగవాళ్లకు- ఆడవాళ్లకు రిజర్వుడు క్లాసులో అడ్డంగా స్టాండ్లు నిలబెట్టారు. చంద్రిక తన సీటులోనుంచి లేచి నిల్చొని పురుషులు రిజర్వుడు క్లాసులో నున్న వారినందరినీ ఒకసారి పరీక్షగా తిలకించింది. అక్కడ పార్వతి-ఆమెప్రక్కన శర్మ కనిపించారు చంద్రిక అలాగే అయిదు నిముషాల పాటు నిలబడి తదేక దృష్టితో శర్మవైపు చూచింది. పార్వతి చంద్రికను గుర్తించలేదు. తనను ప్రేమతో తిలకిస్తున్న చంద్రికా సౌందర్యమును పార్వతితో మాట్లాడుతూ శర్మ మధ్య మధ్య చూచాడు. ఆట ప్రారంభింపబడింది. ఇంటర్వల్‌లో లైట్లు వెలిగాయి. కుర్చీల క్లాసులో వసంత్-కోటయ్య లేచి నిలబడి స్త్రీలను పరీక్షిస్తున్నారు. వసంత్ వేలుపెట్టి చంద్రికవైపు చూసి కోటయ్యతో "అదిగో మా అక్క." అన్నాడు.

"నువ్వు చాలా మంచివాడివి. నువ్వెన్నడూ అబద్ధాలాడవు. నాకు నువ్వు నిజంగా బావమరిదివే!" అన్నాడు కోటయ్య.

కోటయ్య నలభై వత్సరాల భూస్వామి. నల్లగా, దృఢంగా, పొడుగ్గా వుంటాడు. ప్రాచీనకాలపు రైతులు జ్ఞప్తికివస్తారు, అతని జుట్టుముడి - నీరకాయిపంచెలు చూడగానే. నోట్లో చేబ్రోలు పొగచుట్ట ప్రేమసముద్రంలో నావకు దారిచూపే సెర్చిలైటువలె జాజ్వల్యమానంగా వెలుగుతోంది. బిరుసెక్కిన ముఖంలో జాలి అనేది ఏమాత్రం కనిపించదు. మాటలు చాలా మోటుగా వుంటాయి. ఊతపదంగా ఏదో బూతువాడకుండా వాక్యాన్ని ఆరంభించడు. మద్యపాన నిషేధమున్నా, ప్రత్యేకంగా ప్రభుత్వానుమతితో మద్యాన్ని తెప్పించుకుని త్రాగే మధుపాయి. అందం, ఆనందం ధనాన్ని వినియోగిస్తే లభ్యమౌతాయని అతని దృఢనిశ్చయం కావడం వలన తాను వలచిన స్త్రీకోసం ఎంత ధనమైనా వెచ్చించడానికి వెనుదీయడు. చంద్రికకు నెలకు రెండువందలిస్తున్నాడు. ఇలా రెండు సంవత్సరాలనుండీ డబ్బు ఖర్చుపెడుతున్నాడు. పండగలకు ప్రత్యేకంగా సిల్కు వస్త్రాలు కొని తెస్తాడు. ఇవిగాక వెయ్యి రూపాయిలతో చక్కని నెక్‌లెస్ కొనిపెట్టాడు.

కోటయ్య నేటి నాగరికతను బహిరంగంగా ద్వేషించే పల్నాటివీరుల సంతతివాడు. అతడు

వేషంలో అనాకారిగా కనిపించినా, చేతికి గడియారం, జేబులో ఫౌంటెన్ కలం ధరించి, తాను 1880లో జీవించడం లేదని జగత్తుకు నిరూపిస్తాడు. అన్ని వస్తువులవలెనే తనువుహూ, సౌందర్యాన్నీ, ఆత్మనీ, ధనానికమ్మడం ఒక వ్యాపారసరళి కావడంవలన చంద్రిక కొత్తదు కొత్తగా కనిపించక. శరీరానికి స్త్రీకోరే సంతోషాన్ని ప్రసాదించగల అసామాన్యవీరుడుగా కనిపించేవాడు.

స్త్రీలకు సౌందర్యారాధన 16-20 సంవత్సర మధ్యకాలంలో మాత్రమేననీ, తరువాత పురుషుల దృఢత్వము పైననే వారి దృష్టి కేంద్రీకరించుననీ పెక్కుమంది వైద్య నిపుణుల అభిప్రాయం. ఇరువది సంవత్సరాల యువతులకువలె చంద్రికకు ఆనాటి తేనెటివిందులో శర్మను చూచిన క్షణంనుండీ పురుషుల సౌందర్యం, విజ్ఞానం, పలుకుబడి, ధనాన్ని మించినదిగా తోచింది.

ఆటపూర్తయి జనమంతా గుంపులుగా హాలునుండి బయటపడుతున్నారు. ఆరేయి పున్నమ వెన్నెల కన్నుల కానందదాయకంగా వికసించింది రాత్రి రెండు గంటలకు.

జనుల సందడి తగ్గినతరువాత శర్మ, పార్వతి బైటికిరాగానే చంద్రిక వారికెదురుగా వెళ్లి ఇరువురికీ నమస్కరించి "శర్మగారూ! ఈ సాయంత్రం మీ ఉపన్యాసానికి మిక్కిలి ఆకర్షింపబడినవారిలో నేనొకతెను. మీరీగ్రామంలోనే వుంటున్నారని విని నా దురదృష్టాన్ని నిందించుకొన్నాను" అన్నది.

"తమ పేరు?" అన్నాడు శర్మ.

"చంద్రిక!" అన్నది చిరునవ్వు పువ్వులు కురిపిస్తూ.

"ఆహా! ఎంత చక్కని పేరు! మీరు నిజంగా చంద్రిక కావడంవల్లనే మేఘాచ్ఛాదితాకాశం ఈరాత్రి యింత వెన్నెలకాంతితో మనసున కశాంతి కూరుస్తున్నది!" అన్నాడు శర్మ ప్రేమతో.

"చాలా ప్రొద్దుపోయింది! పోదాం పదండి శర్మగారూ!" అని తొందరపెట్టింది పార్వతి చంద్రికను చులకనగా చూస్తూ.

ఇంతలో అక్కడికి కోటయ్యా, వసంత్ వచ్చేసరికల్లా పార్వతీ, శర్మా గుర్రపు బండీలో వెళ్ళిపోయారు.

* * *

దోవలో కోటయ్య "ఆమె ఎవరు?" అని అడిగాడు.

"ఆమె పార్వతి. ఈ టాకీలో నటించింది. ఆయన శర్మగారు. ఆమె స్నేహితుడు. ఆమెకివాళ యీ గ్రామప్రజలు సన్మానం జరిపారు. పెద్దవిందు ఏర్పాటుచేశారు. ఆ విందులో శర్మగారు మృదుమధురంగా పార్వతి గొప్పతనం గూర్చి ఉపన్యసించారు!" అన్నది.

"నీకు సినిమాలో కెళ్ళాలని మా పిచ్చిగా వుంది. ఇటువంటి పిచ్చాలోచనలు పెట్టుకోకు. సినిమావాళ్ళంతా దుర్మార్గులు. నీవు నా దానివి!" అన్నాడు కోటయ్య చంద్రిక తన పెన్నిధిలాగున.

ఆ మాటలువిని గుండెబరువుతో చంద్రిక నిట్టూర్పు విడిచింది.

ఆ మరునా డుదయంనుంచి మధ్యాహ్నం మూడుగంటలకు చాలా ప్రయాసతో చక్కని భాషలో స్వదస్తూరీలో సుదీర్ఘ లేఖ నొకదానిని తయారుచేసి అందమైన కవరులోవుంచి కవరంటించి పైన అడ్రస్ వ్రాసి తమ్ముడి చేతి కిచ్చింది చంద్రిక.

"నీవు పార్వతి యింటికి వెళ్ళి శర్మగారికి మాత్రమే ఈలేఖ నీయాలి. పార్వతి కీయవద్దు, ఆమె దుర్మార్గురాలు" అన్నది చంద్రిక.

వసంత్ చక్కని నూత్నవస్త్రాలు ధరించి రిక్షాలో పార్వతి యింటికి వెళ్లాడు. పార్వతి అప్పటి కింకా సింగారించుకొనలేదు. మధ్య హాలులో పడక కుర్చీలో పరుండి సినిమా పత్రిక చదువుతున్నది.

"శర్మగారున్నారా?" అని పార్వతిని ప్రశ్నించాడు వసంత్.

"ఉన్నారు దేనికి? మీ అక్క పిలుచుకరమ్మన్నదా? రానన్నారని చెప్పు. రాత్రే వాతో చెప్పేశా రీవిషయం!" అన్నది పార్వతి.

"వారుంటే ఒకసారి యిటు రమ్మనండి!" అన్నాడు వసంత్.

"శర్మగారూ! మీకోసం చంద్రికవచ్చింది!" అని కేకవేసింది పార్వతి ఎగతాళిగా.

శర్మ ఒక బనీనుతో చేతిలో ఒక ఆంగ్ల గ్రంథంతో అక్కడికివచ్చి వసంత్‌ని చూచి ఆశ్చర్యంతో "ఏదీ ఆమె?" అని పార్వతిని ప్రశ్నించాడు.

"మీ కెదురుగా కన్పించుతూంటే నన్ను డుగుతారేం? చంద్రికకూడా చిన్నతనంలో లాగు చొక్కా తొడుక్కుని అచ్చంగా ఇతని వలెనే వుండేది. మగరాయుడు!" అన్నది పార్వతి.

వసంత్ ఆ మాటలకు ముఖం చిన్నబుచ్చుకుని కవరు ఆయన చేతిలోపెట్టి నమస్కరించి వెళ్ళిపోయాడు.

"ఏదీ ఆ వుత్తరం?" అని వెంటపడింది పార్వతి.

శర్మ ముందుగా పడకగది ప్రవేశించి పార్వతి రాకముందే తలుపులు గడియలు వేసుకున్నాడు.

శర్మ నలుబది వత్సరాల లోపువాడు. మద్రాసులో అతనికి పార్వతితో పరిచయమైంది. పార్వతి టాకీ పూర్తికాగానే విశ్రాంతికోసం స్వగ్రామం వస్తూ శర్మగారిని వెంట తీసుక వచ్చింది. శర్మ రచయిత, విమర్శకుడు.

"తలుపుతీయండి శర్మగారూ!"అని పార్వతి తలుపులు కొట్టింది. శర్మ ఉత్తరమంతా చదివి దానిని ముక్కలుగాచింపి అగ్గిపుల్ల వెలిగించి వాటి కంటించి తలుపు తెరిచాడు. పార్వతి కాలుతున్న ఉత్తరపుముక్కల్ని చూచి.

"మీరీ కొంప తగలబెట్ట దలిచారా?" అన్నది.

"ఇంతమాత్రానికే కొంప లంటుకపోవుతే? మీ ఆడవాళ్ళలో అసూయ పోతేగాని మీరు పురుషులకు సమానులు కాలేరు. ఎంత సంస్కారమున్నా స్త్రీ స్త్రీగానే ప్రవర్తిస్తుం దీదేశంలో" అన్నాడు శర్మ.

"ఉత్తరంలో ఏం రాసింది? నాకు చెప్పరూ" అని పార్వతి అతనిమీద వాలింది. శర్మ ఆమె బరువైన దేహస్పర్శకు విసుగుదలజెంది "కాస్త ఎడంగా నిల్చుంటే చెబుతాను. ఎందుకలా మీదపడతావు చిన్న పిల్లలవలె" అన్నాడు.

"ఈ కొంపకు నిప్పుపెట్టమని రాసిందా?" అన్నది పార్వతి.

"ఆఁ. అచ్చగా అదే రాసింది! నీకు తృప్తి కలిగిందా? ఆమె మానసికంగా చాలా బాధ పడుతున్నది. నన్నొకసారి వచ్చి చూచి పొమ్మన్నది!" అన్నాడు శర్మ.

"మీరు దానింటికి వెళ్లడానికి వీల్లేదు. అది చాలా తక్కువరకం మనిషి. దాన్ని పోషిస్తున్న వాణ్ణి నిన్నరాత్రి లైట్ల వెల్తురులో చూచారుగా! అతడు పరమ దుర్మార్గుడు. అతడు హంతకుడు. మీ రామెతో పరిచయం కలిగివుండడాన్ని అతడు తెలుసుకుంటే ప్రాణాపాయకరం!" అన్నది పార్వతి.

"ఆమాత్రం నాకు తెలియదనా నీ వుద్దేశ్యం? అసలు మగవాణ్ణి, నాకు నీ ఆజ్ఞ లేమిటి? నేనామెయింటికి వెళ్లడం మానడం నాయిష్టం తెలిసిందా?" అన్నాడు శర్మ.

"మీప్రాణం నా ప్రాణంగా చూచుకొని మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు నానుండి విడిపోవడం నా కిష్టంలేదు. అంతేకాదు మీ రపాయంలో చిక్కుకోవడం నా కిష్టంలేక చెప్పాను. మీ స్నేహితురాలి మాట వినండి!" అన్నది పార్వతి.

"నాకు చిన్నపిల్లాడికి చెప్పినట్టు బోధిస్తున్నావు. నేనేం స్త్రీల నెరుగననా? స్త్రీల మూలకంగా సంభవించే దుష్ఫలితాలు నేను ప్రతిదినం చూస్తూనేవున్నాను. ఆమె వుత్తరం వ్రాసిందని నేను ఇప్పుడే అక్కడికి రెక్కలు కట్టుకుని ఎగిరిపోవడం లేదు!" అన్నాడు శర్మ.

"నిన్నరాత్రి నాయెదుట మీ రామెతో అన్నమాటలు నేను మరిచిపోలేదు. మీకామె మీద అపేక్షవుంది. ఆమె నా కంటెకూడా పెద్దది వయస్సులో. చిన్నదివలె కనిపిస్తుంది. ఆ పల్లెటూరివాడు దాన్ని బాగా గొడ్డుని మేపినట్లు మేపుతున్నాడు!" అన్నది పార్వతి.

శర్మ వెంటనే ఒక జవాబువ్రాసి కవరులో పెట్టి అంటించి పోస్టులోవేయడానికి వెళ్తూంటే పార్వతి ఆందోళనతో,

"ఎక్కడికి వెళ్తున్నారు ? దానింటికే కాదూ?" అన్నది.

"కాదు పోస్టాఫీసు. ఆమెకు జవాబు వ్రాశాను. అది పోస్టులోవేసి వస్తాను బిళ్లలంటించి" అన్నాడు శర్మ.

మీ రిదోవంకతో ఇంటినుంచి వెళదామనుకుంటున్నారు. మీమగవారి ఉపాయాలు నాకు తెలియనివేం కాదు. నేనా కవరు పనిమనిషికిచ్చి పోస్టులో వేయిస్తాను. తెండి!" అన్నది పార్వతి.

"నీవనూయాపరురాలివి. నాకు నీ మాటల్లో నమ్మకంలేదు. ఈ వుత్తరం పోస్టులో నేనే స్వయంగా వేయదలచాను. నీకు నమ్మకం లేకపోతే నీవుకూడారా నా వెంట!" అన్నాడు శర్మ.

అగ్ని సాక్షిగా పెండ్లాడిన తన భార్యకూడ ఎన్నడూ తనకిబ్బంది కలిగించలేదని శర్మ మనసులో బాధపడ్డాడు.

ఇద్దరూ కలిసివెళ్ళి ఆ కవరు పోస్టులో వేసి వచ్చారు.

"ఏం రాశారు త్తరంలో?" అన్నది పార్వతి దారిలో.

"యింటికి రావడం నాకు పడదు, అది అపాయకరమని కూడా నేను తెలుసుకున్నాను; అని నిష్కర్షగా రాసేశాను" అన్నాడు శర్మ.

* * *

శర్మ పార్మతి చూడకుండా వున్నవేళ చంద్రిక యింటికి బైలుదేరి వెళ్ళాడు. చంద్రసేన శ్రీరాముడి కొరకు వేచివున్నట్లుగా చంద్రిక శర్మకోసం నిరీక్షిస్తోంది. తానులేఖలో సూచించిన టైం దాటిపోయినా ఆమె నిరాశచెందక చూస్తూనే వుంది.

ఒక రిక్షానుండిదిగి శర్మ ఇంటిలోకి వెళ్ళాడు. వీథితలుపులు గడియవేసి చంద్రిక అతన్ని గౌరవించే నిమిత్తం ఒక స్వీటు, ·పకోడీలు, కాఫీ, సిగరెట్లు, తమలపాకులు అన్నీ సిద్ధం చేయించింది. ఆమె, శర్మ, చెరొకకుర్చీలో కూర్చొని విద్యుద్దీపకాంతిలో ఫలహారం తీసుకొనసాగారు.

"నా విన్నపహాలకించి మీరు యీ పేదరాలింటికి విచ్చేశారు. నా జన్మ పావనమైంది. నేను బాల్యంనుంచి అజ్ఞాన అంధకారంలో ఉన్నాను నిన్నటి వరకూ! నిన్న మీ వుపన్యాసం విన్నతరవాత, మిమ్మల్ని నేత్రోత్సవంగా చూచింతరవాత నాకు ప్రపంచమేమిటో తెలిసింది. మోటువాడి చేతిలో మల్లెపూవుగతి పట్టింది నాకు! మీరు నన్ను మీతో మద్రాసు తీసుకపోయి నాకో జీవనమార్గాన్ని చూపినా సరే,మీపాదదాసిగా వుండటాని కంగీకరించినా సరే, నేనిక్కడ ఈ దుర్భరజీవితం జీవించలేను. పార్వతీ నేనూ బాల్య స్నేహితులం. ఆమెకు నేనంటే ఇష్టమేలేదు. కాని తనకు సన్మానం జరుగుతున్నదని ఆహ్వానమొకటి నాకు కూడా పంపి నన్ను వెలుగులోకి తీసుకవెళ్ళింది!" అన్నది చంద్రిక ఏక ధోరణిగా.

ఆ మాటలు విని నవ్వి శర్మ "ఆలోచిస్తాను" అన్నాడు.

"మీరు నా విషయంలో శ్రద్ధవహిస్తే నేను పార్వతికంటే ఎక్కువగా టాకీలకు పనికి వస్తాను. చక్కగా సంగీతం పాడగలను. నా స్వరూపం చూచిన మీరు చెప్పాలి, నేను సినిమాకు పనికి వస్తానో లేదో? మీదయ గనక వుంటే..." అన్నది చంద్రిక.

"నేను నీకోవుత్తరంరాసి పోస్టులోవేశాను. అది నీకు రేపందుతుంది. నేనిక్కడ ఎక్కువసేపుండడానికి వీలుకాదు. నీవుపరాయిదానివి" అన్నాడు శర్మ.

"అలా అనకండి! నేనుమీదానిని. కోటయ్యగారు రాత్రి పదిదాటితేగాని ఇక్కడకురారు" అన్నది చంద్రిక.

శర్మ కాపేరు వినేసరికి కోటయ్యమీద నేగాక, అప్సరసలాగున్న చంద్రిక మీద కూడా మనసులో అసహ్యం కలిగింది. కాని యేం చేస్తాడు? తానామె సముఖంలో ప్రముఖ రసికుడుగా నున్నాడు. కోటయ్య ప్రభుత్వానుమతితో నిల్వచేసుకున్న మద్యంతెచ్చి గ్లాసులో పోసి శర్మకిచ్చి తాను కూడా పుచ్చుకుంది. అమృతంవంటి మద్యపానంతో అలవాటున్న శర్మ మనసంతా నందనవనవిహారంలో మునిగింది.

రాత్రి తొమ్మిది గంటలకు మరల రిక్షామీద ఇంటికి చేరుకున్నాడు. పార్వతి కతన్ని చూడగానే కళ్ళనీళ్ల పర్యంతమైంది. అతన్ని ఎన్నో ప్రశ్నలు వేసింది. కాని అతడు సమాధానం చెప్పలేని స్థితిలో పందిరి మంచంలో పరుండి

నిద్రపోయాడు. పార్వతి మేలుకుని కూచుంది. అతను భోజనం చేశాడో లేదో ఆమెకు తెలియదు. తాను భోజనం చేయలేదు. రాత్రి పదకొండు గంటలకు అతను నిద్రలోనుంచి మేల్కొంచి, "బాగా ఆకలేస్తోంది, భోజనం చేయాలి!" అన్నాడు స్వగతంలో.

"రండి, భోజనం చేదాం. నేనూ ఇంతవరకు భోంచేయలేదు. మీరిక యీ వూళ్ళో వుంటే. మీ ఆరోగ్యం చెడుతుంది. మీరు మద్రాసు వెళ్తానంటే నాకేమీ అభ్యంతరం లేదు." అంది పార్వతి.

శర్మ సమాధానంచెప్పక మౌనంతో భోజనం చేశాడు.

"దానింటికి వెళ్ళారు కదూ!" అని పార్వతి తల పంకించింది.

"నేను నాలుగు రోజుల్లో మద్రాసు వెళ్ళిపోతాను. నీ వన్నట్లు నేనీ వూళ్ళోవుంటే శ్రీకృష్ణమూర్తినైపోతానేమో? ఆయన దేవుడు కాబట్టి ఫరవాలేదు. నేనుమానవుణ్ణి. అన్నాడు శర్మ.

"మీరు ఇతరాలోచనలు లేకుండా వుండగలిగితే మీరెన్నాళ్లున్నా నాకభ్యంతరంలేదు. కాని ఆ నీచురాలింటికి...?" అన్నది పార్వతి.

"అందులో దోషమేమీ లేదు. ఆమెకూడా వేశ్యే!" అన్నాడు శర్మ.

"మీ ఆదర్శాలన్నీ నాశనమైపోతాయి!" అన్నది పార్వతి.

"ఆదర్శాలు మనసులోనే ఉంటాయి. వాటి నాచరించగలిగితే వాటి నాదర్శాలని పిలువ నవసరముండదు!" అన్నాడు శర్మ.

చంద్రిక ఇంటికి పోకుండా శర్మను పార్వతి కళ్లెంవైచి వెనక్కు లాగలేకపోయింది. మధుపానం, మధురాధరపానం హృదయానికి వ్యసనమై అసమశరార్తిలో కీర్తిపాడవుతుందని లెక్కచేయడు కామాంధుడగు మానవుడు.

ఏ దాతయినా దాన, ధర్మాలు చేస్తే అతని దాతృత్వం లోకం గుర్తించదు. అవినీతిని అగ్నివలె ఇట్టే ప్రజలు గుర్తిస్తారు. చంద్రిక కోసం చకోర పక్షులవలె, చంద్రికకోసం విప్రయోగ వేదనాదోదూయమాన మానసులైన మానవులు, శర్మ రాకపోకలను అకళించుకుని, వేశ్యకు ప్రేమ జ్వరం రావడం విపరీతమని వ్యాఖ్యానించి ఊరుకోలేదు. ఈ వర్తమానం కోటయ్య శ్రవో రంధ్రముల పడేటట్లు చేశారు. దక్షయజ్ఞ ధ్వంసి వీరభద్రునివలె కోటయ్య కోపోద్రిక్తుడైనాడు. చంద్రిక యింట్లో తానుంచిన మద్యం తనుగాక ఎవరో త్రాగుతున్నారని అతనికి కలిగిన అనుమానానికి అగ్నికి వాయువువలె తోడయింది, ప్రజలతనికి అందజేసిన వార్త!

ఆనాడు సాయంత్రం కోటయ్య తమగ్రామం నుంచి నడిచివస్తూ దారిలో నాటుసారాయి త్రావి, మరికొంత ఒక సీసాలో పోయించుకుని మంచి నిషాలో తూలుతూ, నిప్పులు గ్రక్కుతూ లోలోపల గొణుక్కుంటూ పట్టణంలో ప్రవేశించి మొదట కనిపించిన రిక్షాలో యెక్కి చంద్రిక యింటికి వచ్చాడు. చంద్రిక మొదటి రెండురోజులు భద్రతకోసం వీధి తలుపులు గడియ వేసింది కాని పిమ్మట ప్రేమదాహంలో శర్మరాగానే ఆ విషయమే మరిచిపోయి. దాసీదానికి ఆపని పురమాయిస్తే అది ఆసమయంలో కోటయ్యరాడుకదా అని తలుపులు గడియ వేయకుండా దగ్గరకు వేసివుంచుతోంది.

కోటయ్యతూలుతూ ఇంట్లోప్రవేశించి గడియవేయబడివున్న గదితలుపు కొట్టాడు. రానున్న అపాయం ఎరుగక చంద్రిక తలుపు తెరచి ఎదురుగా నిప్పులు క్రక్కుతున్న కోటయ్యను చూచి మరల తలుపులు వేయడానికి ప్రయత్నించింది. బలవంతుడైన కోటయ్య కాలితో ఒక తన్నుతన్ని తలుపును గట్టిగానెట్టి లోపల ప్రవేశించి బొడ్డులోనుంచి బాకు దూశాడు.

మంచంలోనున్న శర్మ అపాయంలో చిక్కుకున్నాడు. ఆ గదికి అదొక్కటే ద్వారం! కోటయ్య చేతిలో బాకు కనిపించింది. శర్మకడ్డంగా చంద్రికనిలబడి కోటయ్యను వారించుతున్న సమయంలో-కోటయ్య ఆమెను ప్రక్కకు నెట్టి బాకుతో శర్మ ముఖాన ఒక్క పోటు పొడిచాడు. శర్మ మొఖం నెత్తురుమయమై అతను కోటయ్య చేతిని పట్టుకోగలిగాడు. కాని ప్రాణానికి తెగించిన కోటయ్య తన చేతిని లాగుకొనడానికి పెనుగులాడుతుండగా, చంద్రిక ఒక కర్రతో కోటయ్య నెత్తిన బల

మైన దెబ్బకొట్టింది. 'అబ్బా' అని కోటయ్య వెనుదిరిగి చూడగా శర్మ కోటయ్య చేతిలో బాకు లాక్కొని అతన్ని పొడవబోతుండగా, కోటయ్య చంద్రిక జుట్టుపట్టుకుని ఆమెను గుద్ది కఱ్ఱ లాక్కొన్నాడు. శర్మ పొడిచిన బాకు పోటు కోటయ్య చేతికి తగిలింది. కోటయ్య కఱ్ఱతో శర్మను కొట్టడానికి అక్కడ తగినంత చోటు లేక కఱ్ఱ తిరగలేదు.

ఇంతలో అక్కడ దేవదూతలవలె ఇద్దరు పోలీసులు ప్రత్యక్షమయారు తుపాకులతో. అందరూ ఏకమై కోటయ్యను బంధించారు. సంతత రక్త ప్రవాహంతో శర్మ నీరసుడై క్రింద పడిపోయాడు. పోలీసులు కోటయ్యను పట్టుకోవాలని చాలా దూరంనుంచి వెన్నాడుతున్నారు. అతను దారిలో త్రాగి వెళ్ళినట్లు ఆచూకీ తెలిసి, ఎక్కడికి వెళ్ళినదీ తెలియక అతనిగూర్చి విచారిస్తూ వస్తున్నారు. వాళ్ళు కోటయ్య వెంటనే వచ్చివున్నట్లయితే శర్మకు గాయం తగిలేదికాదు.

శర్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూండగా పార్వతి అతన్ని చూడడానికి వచ్చింది. శర్మ ఆమెనుచూచి సిగ్గుతో తలవంచుకొని, మౌనంగా రెండు కన్నీటి బిందువులు విడిచాడు.

“మీ ముఖమంతా పాడయింది. ఏ ఆడదీ మిమ్మల్ని ఇక వాంఛించకుండా వాడు మిమ్మల్ని అనాకారిని చేసి ధన్యుడైనాడు! చిలుకకు చెప్పినట్లు ఎంతచెప్పినా నామాట విన్నారా?” అన్నది పార్వతి.

తన కీర్తి, ప్రతిష్ఠలు,తన సౌందర్యం, తన విజ్ఞానం ఒక అజ్ఞానుడి మూలకంగా మంట కలిసి పోయినాయి! “సెక్కు భంగులు వివేక భ్రష్టసంపాతముల్”, అని భర్తృహరి చెప్పినట్లుగా తాను వేశ్యాలోలుడగుటే తన దోషం.

కోటయ్యకు ఐదు మాసాల ఖైదు విధించింది ప్రభుత్వం. శర్మ ఆరోగ్యవంతుడై చంద్రికను తీసికొని మద్రాసు వెళ్ళిపోయాడు. ముఖాన నుదురున రెండంగుళాల మచ్చ అతని తుచ్ఛకామాంధతకు గుర్తుగా మూర్తీభవించింది. పార్వతి అతని ముఖం చూచి అసహ్యపడింది. చంద్రిక తన భవిష్యత్తును నిర్మించబోతున్న అతనికి తన సర్వస్వం అర్పించడానికి స్థిర నిశ్చయం చేసుకుంది.

---

కథానిక

# బ్రహ్మచారుల బాహ్యచింతన

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

ఉదయం ఏడుగంటలయింది. రవి తన సహాధ్యాయి గోపితో కలిసి మహాభాష్యంలో పశ్పశాహ్నికంలోని వ్యాకరణాధ్యయన ప్రయోజనాల్ని చింతన చేస్తున్నాడు. ఎవరో ఒకాయన వచ్చారు. ఆయన కొంసేపు అటూ ఇటూ చూసి ఇక్కడ రవీంద్ర శర్మగారున్నారా?” అని అడిగారు.

రవి కూర్చున్నవాడల్లా లేచి “ఎందుకండీ?” అని సవినయంగా అన్నాడు.

“ఆయనతో కొంచెం మాట్లాడాలి.”

“నేనే! కూర్చోండి.”

అందరూ కొంసేపు నిశ్శబ్దంగా కూర్చునారు. తరువాత రవి “అయ్యా! తమ దేవూరు” అని అన్నాడు. ఆయన “మాది కృష్ణాపురం, నా పేరు మాధవశర్మ అని అంటారు. మాది హారితస గోత్రం” అని కొంసేపాగి “మీరేం చదువుతున్నారు” అని అడిగారు.

“మేమిద్దరం వ్యాకరణ విద్యాప్రవీణ చదువుతున్నాం.”

ఆయన ముఖంలో చిరునవ్వు విరిసింది! “అట్లాగా! ఎంత చక్కటి మాటన్నారు. ఈ రోజుల్లో ఈ చదువు చదివేవాళ్ళేలేరు. ప్రతివాళ్ళూ ఇంగ్లీషు చదివే వాళ్ళే కాని” అని అన్నారు.

గోపి కొంత ముఖం మాడ్చుకుని “అదృష్టవంతుడెవ్వడూ ఈ చదువు చదవడు. చూడండి